# భూమి ఎవరిది...?

సందర్భం

**వి రాజగోపాల్**

ఏప్రిల్ 22 'ధరిత్రీ దినోత్సవం'. అదే రోజు లెనిన్ జయంతి కూడా! 1970వ సంవత్సరంలో మొట్టమొదట అమెరికాలో ఆ తేదీని 'ధరిత్రీ దినోత్సవం'గా గుర్తించారు. అప్పటి నుండి ప్రతి ఏడాదీ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ఏప్రిల్ 22వ తేదీన 'భూగోళాన్ని భద్రంగా భావి తరాలకు అందించడం ఎలా?' అనే అంశంపై అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో ఏడాది ఒక్కో అంశాన్ని చేపడతారు. సంవత్సరమంతా ఆ అంశంపై రకరకాల కార్యక్రమాలు జరపడం, ప్రజలను చైతన్యం చేయడం దీని లక్ష్యం! ఈ ఏడాది 'జీవావరణ పరిరక్షణ' అంశాన్ని చేపట్టారు. భూమి ఏ ఒక్క జీవరాశికో పరిమితం కాదు. ఇక్కడ పుట్టిన ప్రతి జీవి మనుగుడ సాగించాల్సిందే! ఏ ఒక్క జాతి స్వార్థం, మిగిలిన వాటికి శాపంగా మారకూడదు.

కానీ, జరుగుతున్నదేంటి? మానవాళి స్వార్థం కారణంగా అనేక జీవజాతులు ఇప్పటికే అంతరించి పోయాయి. మరికొన్ని అదే బాటలో ఉన్నాయి. దీనివల్ల మానవ మనుగడకు కూడా ప్రమాదకరమని తెలిసినా ప్రకృతి విధ్వంసకాండ ఏ మాత్రం ఆగడం లేదు. పర్యావరణ ఉద్యమకారుల ఆందోళనలకు బ్రెజిల్ వంటి దేశాలలో రాజకీయ పార్టీలు కొంత స్పందిస్తున్నాయి. మరి మన దేశం సంగతేంటి? మూడు వైపులా సముద్రాలు, ఉత్తరాన మంచు కొండలు, నిప్పులు చిమ్మే థార్ ఎడారి! సంవత్సరం పొడవునా ప్రవహించే జీవనదులు కొన్నైతే, వాటితో పోటీపడుతూ ప్రవహించే మరి కొన్ని నదులు! ఉత్తర, దక్షిణ భారత దేశాలను వేరు చేసే వింధ్య పర్వతాలు, పచ్చదనాన్ని రంగరించుకున్న పడమటి కనుమలు ఒక వైపు ఉంటే తూర్పు కనుమలు మరో వైపు! వీటి అధారంగా దేశమంతా అనేక ప్రాంతాల్లో విస్తరించిన కీకారణ్యాలు...ఇదీ మన దేశ పర్యావరణ వైభవం! అపురూపమైన ఎన్నో జీవజాలాలకే కాదు, సాధారణ ప్రజానీకంలో అనేక మందికి ప్రకృతి లోని ఈ వైవిధ్యమే జీవనాధారం! దేశంలో ఇప్పటికీ సగం జనాభా వ్యవసాయం మీదే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆధారపడి ఉంది. ఇక అడవులను ఆవాసాలుగా చేసుకుని, అటవీ ఉత్పత్తుల ఆధారంగా జీవనం సాగించే వారు సుమారుగా 25 కోట్ల మందికి పైగా ఉన్నారు. వీరిలో ఆదివాసీలే 10 కోట్లు! సముద్రాలు, నదులు, చెరువుల్లోని మత్స్య సంపదను ఆధారం చేసుకుని జీవనం సాగిస్తున్న వారి సంఖ్య కోటి పైనే (ఆధారం 2003 నాటి లైవ్‌స్టాక్ లెక్కలు)! పర్యావరణంలో చోటుచేసుకునే ఏ కొద్ది మార్పు అయినా వీరందరి జీవితాలను ప్రభావితం చేస్తుంది. జీవజాల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తుంది. ఇంత కీలకమైన అంశం దేశ వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం హోరందుకుంటున్న వేళ రాజకీయ పార్టీల మ్యానిఫెస్టోల్లోనూ, నేతల ప్రసంగాల్లోనూ కచ్చితంగా చోటు చేసుకుంటుందని భావిస్తే పొరపాటే! అధికారం కోసం పోటీ పడుతున్న బిజెపి, కాంగ్రెస్‌లు వాతావరణ మార్పులు, పర్యావరణం వంటి అంశాలను సాధ్యమైనంత వరకు దాటవేయడానికే ప్రయత్నిస్తున్నాయి. ఆ పార్టీల నేతలు పొరపాటున కూడా ఈ అంశాలను ప్రస్తావించడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు ఈ రెండు పార్టీలు కీలకమైన ఈ అంశాలలో అంతర్జాతీయ స్థాయిలో అమెరికాకు అనుకూలంగానూ, జాతీయ స్థాయిలో కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చే విధానాలను అమలు చేస్తున్నాయి.



**రేపు ధరిత్రీ దినోత్సవం**

తాజా ఎన్నికల నేపథ్యంలో వాయు, జల కాలుష్య అంశాలను కాంగ్రెస్, బిజెపిలు మ్యానిఫెస్టోల్లో పేర్కొన్నాయి. దేశ రాజధాని నగరం ఢిల్లీని వాయు కాలుష్యం వెంటాడుతుండటంతో దానిని ప్రస్తావించక తప్పని స్థితి నెలకొంది. రెండు పార్టీలు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సిఎపి)'ని మరింత బలోపేతం చేయడం ద్వారా వాయు కాలుష్యాన్ని అరికడతామని పేర్కొన్నాయి. కాంగ్రెస్ పార్టీ వాయు కాలుష్యాన్ని 'జాతీయ అత్యవసర పరిస్థితి'గా అభివర్ణించింది. భారతీయ జనతా పార్టీ ఎన్‌సిఎపిని 'మిషన్'గా మార్చి వాయు కాలుష్యాన్ని 35 శాతానికి తగ్గిస్తామని చెప్పింది. సమస్యకు నిర్దిష్ట పరిష్కారం చూపకుండా మాటల గారడీ చేయడానికి ప్రయత్నించడాన్ని ఇక్కడ గమనించవచ్చు. నిజానికి ఈ రెండు పార్టీలు కార్పొరేట్లకు పెద్దఎత్తున రాయితీలు ప్రకటించాయి. 'సింగిల్ విండో' అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చాయి. వీటిలో ఎక్కడా కాలుష్య కారక వాయువులు, ఉద్గారాల నియంత్రణ వంటి అంశాల ప్రస్తావన లేదు. ప్రైవేటు వాహనాలకు బదులుగా ప్రజా రవాణా వ్యవస్థను విస్తృత పరిచే ప్రతిపాదనల ఊసు లేదు. అరకొరగా ఉన్న ప్రజా రవాణా వ్యవస్థను కూడా ప్రైవేటుకు అప్పగించే ఆలోచనలు మాత్రం పుష్కలం! దేశ వ్యాప్తంగా ప్రజానీకం ఎదుర్కొంటున్న నీటి విషయానికొస్తే రెండు పార్టీలు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చాయి. 'నమామి గంగే' ప్రాజెక్టును 2022 నాటికి పూర్తి చేస్తామని బిజెపి పేర్కొంటే, గంగతో పాటు ఇతర ప్రతిష్టాత్మక నదులను శుద్ధి చేయడానికి బడ్జెట్‌ను రెండింతలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. రెండు పార్టీలు భూగర్భ జలాలు కలుషితమౌతున్న తీరును, దానికి కారణాలను, పరిష్కారాలను ప్రస్తావించడానికి కూడా సిద్ధపడలేదు. నిజానికి దేశ వ్యాప్తంగా భూ గర్భ జలాలు కలుషితం కావడం తీవ్ర సమస్యగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్న వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి అంశాలపై మ్యానిఫెస్టోలో బిజెపి పూర్తి మౌనాన్ని ఆశ్రయించగా, ఎటువంటి కార్యాచరణను ప్రకటించకపోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ మభ్య పెట్టే ప్రయత్నం చేసింది. ఒక అంచనా ప్రకారం దేశ వ్యాప్తంగా 517 లోక్‌సభ నియోజక వర్గాల్లో (జమ్మూకాశ్మీర్, అండమాన్ నికోబార్ దీవులను మినహాయిస్తే) ఓటర్లను అటవీ హక్కుల చట్టం ప్రభావితం చేస్తుంది. వీటిలో 133 నియోజకవర్గాలలో ఇది చాలా తీవ్రమైన అంశం! ఆశ్చర్యకరమైన విషయమేమి టంటే ఈ నియోజక వర్గాల్లో అడవుల పరిరక్షణ, అటవీ హక్కుల చట్టం గురించి కాంగ్రెస్, బిజెపిలు మాట్లాడటం లేదు. గిరిజనులకు, ఆదివాసీలకు అడవులపై హక్కులు కల్పించడానికి ఆచరణలో నిరాకరిస్తున్న ఈ పార్టీలు తాము అధికారంలో ఉన్న సమయంలో కార్పొరేట్ల కోసం పెద్ద ఎత్తున అటవీ భూమిని పందేరం చేస్తున్న విషయం తెలిసిందే.

## ప్రత్యామ్నాయం ఇదిగో ...

భూగోళంపై జీవరాశి మనుగడను శాసించే వాతావరణ మార్పులు, పర్యావరణం వంటి కీలక అంశాలను కాంగ్రెస్, బిజెపిలు దాటవేస్తుంటే సిపిఎం దానికి భిన్నమైన వైఖరి తీసుకుంది. హైదరాబాద్‌లో జరిగిన 22వ మహాసభలో ప్రతిపాదించిన రాజకీయ తీర్మానంలో ఈ అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. పారిస్ ఒప్పందం నుండి అమెరికా వైదొలగడం నుండి, సంపన్న దేశాలు తమ వాగ్దానాలను పదేపదే ఉల్లంఘిస్తున్న తీరు వరకు ఈ మహాసభ చర్చించింది. కర్బన ఉద్గారాలను హెచ్చు మోతాదులో తగ్గించడానికి భారత దేశంపై అమెరికా తదితర దేశాలు చేస్తున్న ఒత్తిడిని ఖండించింది. సమర్థ నియంత్రణ ద్వారా విష వాయువు విడుదలను తగ్గించాలని, సాంప్రదాయేతర ఇంధనాన్ని ఉత్పత్తి, వినియోగ రంగాల్లో ప్రోత్సహించాలని పేర్కొంది. రాజకీయ తీర్మానంతో పాటు ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మ్యానిఫెస్టో లోనూ పర్యావరణ అంశాలకు పెద్ద పీట వేసింది. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రత్యేకంగా దృష్టి పెడతామని, లక్ష్యాలను నిర్దేశించుకుని పూర్తి చేస్తామని తెలిపింది. వాతావరణ మార్పుల కారణంగా సంభవించే విపత్తులతో నష్టపోయే ప్రజానీకాన్ని ఆదుకోవడానికి అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేయడంతో పాటు, విపత్తులను నివారించడం వంటి అనేక అంశాలను పేర్కొంది. జల వనరులకు సంబంధించి జాతీయ స్థాయిలో విధానాన్ని రూపొందిస్తామని, నీటి సంరక్షణా విధానాలను అమలు చేయడంతో పాటు ప్రజలందరికీ తాగు నీటిని అందిస్తామని, ఎటువంటి పరిస్థితులలోను ఈ వనరులను ప్రైవేటీకరించేది లేదని స్పష్టం చేసింది. అదే విధంగా ఆదివాసీలకు అటవీ హక్కులను పూర్తి స్థాయిలో దఖలు పరుస్తామని, చట్ట వ్యతిరేకంగా వారి నుండి తీసుకున్న భూములను వారికి అప్పచెబుతామని పేర్కొంది. రాజకీయ తీర్మానంలో కూడా ఈ అంశాన్ని సిపిఎం చర్చించింది. ఆదివాసీలకు హక్కులు కల్పించడం ద్వారానే ఆచరణలో అటవీ పరిరక్షణ సాధ్యమవుతుందన్నది తెలిసిందే!

ప్రజలందరిని భాగస్వాములను చేసే ఈ తరహా విధానాలే భూగోళాన్ని కాపాడుతాయి. కానీ, కాంగ్రెస్, బిజెపిలతో పాటు తెలుగుదేశం వంటి పాలకవర్గ పార్టీలు కార్పొరేట్ల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తాయన్నది ఇప్పటికే నిరూపితమైన సత్యం! మన రాష్ట్రంలో కంపెనీలు కబ్జా చేసిన సుదీర్ఘ సముద్ర తీరాన్ని చూసినా, ప్రభుత్వాలు అప్పచెప్పిన లక్షలాది ఎకరాల భూమిని చూసినా స్పష్టమయ్యేది ఇదే! ఈ పార్టీల నేతలు ప్రజలు వద్దన్నా ఆక్వా పార్కులను, ఫుడ్ పార్కులను, అణు పార్కులను ఏర్పాటు చేసినా, ప్రాజెక్టులు కట్టినా లక్ష్యం కార్పొరేట్ల సేవే! 'నీకింత-నాకింత' వ్యవహారంలో సొంత ఖజానాలు నింపుకోవడమే! 'ధరిత్రీ దినోత్సవ' లక్ష్యాన్ని సాధించి భావి తరాలకు భూమిని భద్రంగా అప్పచెప్పాలంటే పాలకవర్గ పార్టీల విధానాల కారణంగా బాధితులుగా మిగిలే ప్రజలు ఐక్యంగా కదలడమే మార్గం. దోపిడీని పారదోలి, భూగోళం మీద సోషలిజాన్ని మొట్టమొదటిసారి ఆవిష్కరించి కష్టజీవుల స్వప్నాన్ని సాకారం చేసిన లెనిన్ చూపిన మార్గమదే! ఆ దిశలో చేసే కార్యాచరణే భూమిని నాలుగు కాలాల పాటు కాపాడుతుంది. ఆయన జయంతి రోజున జరుపుకునే 'ధరిత్రీ దినోత్సవం' సందర్భంగా అర్పించే ఘన నివాళి కూడా అదే!

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org